
కథ

# నైతికం ఫలాలు

ప్రతాప వెంకటసుబ్బారాయుడు

ఆదివారం పొద్దున్న కాస్త ఆలస్యంగా నిద్ర లేచి మా ఆవిడిచ్చిన కాఫీ సేవిస్తూ పేపరు చదువుతున్న నాకు గేటు తీసిన చప్పుడు వినిపించి తలతిప్పి చూశాను. ఒక పెద్దాయన వయసు అరవై వుండొచ్చు నా వైపు నవ్వుతూ



వచ్చాడు. నేను 'మీరె వరన్నట్టుగా' ఆశ్చర్యార్థకంగా చూశాను.

"నా పేరు జగన్నాథం. నేను మీ ఇంటికి రెండిళ్ళవతల వుంటాను. గవర్నమెంటు ఉద్యోగం చేసి రిటైరయ్యాను. ఇద్దరు కొడుకులు. పెళ్ళిళ్లయిపోయాయి. ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డారు. నా పిచ్చి గాని మీరు మాత్రం మా పిల్లలు గారూ.. ఇంటి మొత్తానికి నేను మా ఆవిడ బిక్కుబిక్కుమంటూ ఉంటాం. అందర్నీ పరిచయం చేసుకోవడం నా అభిరుచి. వచ్చేటప్పుడు ఏం తెచ్చాం? వెళ్ళేటప్పుడు ఏం కట్టుకుని పోతాం? నాలుగు రోజుల జీవిత మజిలీకి, మనిషికి మనిషికీ మధ్య అహంకారపు తెరలు.. అడ్డుగోడలు. మనిషన్నవాడు తోటి వాడికి సాయపడాలి. అందులో ఎంత ఆనందముందన్నది అనుభవైకవేద్యమే కాని మాటల్లో చెప్పలేము. అందుకే నేనూ మా ఆవిడా అందరితో కలసిపోతాం. మాకు తోచిన సహాయం చేస్తాం." చెప్పదలుచుకున్నది పరిచయంలోనే టకటక చెప్పేశారు.

నేను లేచి నా కుర్చీ ఆయనకిచ్చి మా ఆవిడకి ఇంకో కుర్చీ తెమ్మని అరచి చెప్పి "ఎంత బాగా చెప్పారండి! మా నాన్నగారు గుర్తొచ్చారు. నా పేరు మూర్తి. ఏ.జి. ఆఫీసులో పని చేస్తున్నాను. పెళ్ళై రెండేళ్లయింది. ఇంకా పిల్లలు లేరు. పెద్దవారు మీరు.. మీ ఆశీర్వాదాలు కావాలి. మీకెప్పుడు రావాలనిపిస్తే అప్పుడు మా ఇంటికి రావచ్చు మీ అబ్బాయి ఇల్లే అనుకోండి." అన్నాను.

మా ఆవిడ కుర్చీ తీసుకొచ్చి ఆయన ఎవరన్నట్టుగా నా వంక చూసింది. నేను ఆయన్ని పరిచయం చేసేలోగానే "అమ్మా.. నా పేరు..." అంటూ నాకు చెప్పిందంతా ఆమెకి మళ్లీ చెప్పి "అదమ్మా.. నా మాటల్లో మీ ఆయనకి వాళ్ళ నాన్నగారు గుర్తుకొచ్చారట.. నీకూ తండ్రిలాంటి వాడినే. పాపం మా ఆవిడకి ఏమీ తెలియదు. పిచ్చి మొద్దు. కాస్త నువ్వు బజార్లకి వాటికి వెళుతున్నప్పుడు కూడా తీసుకెళితే తనకీ కాస్త కాలక్షేపం!" అన్నారు.

"అయ్యో! మీరు చెప్పాలా? అత్తయ్యగారిని నేను తీసుకెళతాను. ఈ ఇంట్లోకి కొత్తగా వచ్చాం. పరిచయాలు ఎలా చేసుకోవాల్రా భగవంతుడా? అనుకుంటుంటే మీరు మీ అంతట మీరుగా భగవంతుడు పంపినట్టుగా రావడం నిజంగా మా అదృష్టమే! ఉండండి. కాఫీ టిఫిన్ పట్టుకొస్తాను" అని లోపలికి వేగంగా వెళ్ళిపోయింది.

"నాకు ఆడపిల్లలు లేరయ్యా. నీ భార్య ఇహ నుండి నాకు దేవుడిచ్చిన కూతురు" అన్నారు. మానవత్వం తొణికిసలాడే మనుషులంటే నాకు ప్రాణం. అసలు అలాంటి వాళ్ళు ఉంటారా? అనుకునేవాణ్ణి. దేవుడు చూపించాడు వుంటారన్నట్టుగా.

మా ఆవిడ పెసరట్టు ఉప్మా పట్టుకొచ్చి ఇచ్చింది.

నేను లేచి "మీరు తింటుండండి.. నేను ఫ్రెష్ అయి వస్తాను. అని లోపలికెళ్లాను.

నేను వచ్చేసరికి ఆయన తినడం.. కాఫీ తాగడం అయిపోయాయి. పేపరు కూడా చదివేశారు.

వస్తానయ్యా.. పక్క వీధిలో ఉండే మురళి గారికి యాక్సిడెంట్ అయితే హాస్పిటల్లో చేర్చారట. పాపం నాలాగానే ఆయనకీ పిల్లలు దూరంగా ఉంటారు. చూసుకోడానికి వాళ్లావిడ తప్ప ఎవరూ లేరు. పాపం ఆ మహాతల్లి ఏం ఇబ్బంది పడుతోందో?" అంటూ బయల్దేరారు. "నేను స్కూటర్ మీద దింపుతానుండండి" అన్నాను లేస్తూ.

"నేను చూసుకుంటాను లేవయ్యా.. వారమంతా కష్టపడితే ఆదివారం ఒక్కరోజు శలవొస్తుంది హాయిగా విశ్రాంతి తీసుకో! అవసరమైతే సహాయం తప్పక అడుగుతాను" అంటూ వెళ్లిపోయారు.

✦✦✦

రెండు రోజుల తర్వాత నేను ఆఫీసుకి బయల్దేరబోతుంటే హడావుడిగా వచ్చారు. వస్తూనే "ఏవయ్యా మూర్తీ! నాకు అర్జెంట్‌గా పదివేలు కావాలి. పాపం ఆయన పరిస్థితి బాగాలేదు. ఏదో ఆపరేషను చెయ్యాల్ట. ఆ తల్లికేమో కాలూ చెయ్యీ ఆడడం లేదు. గాయాలు మానిపోయాయి కాబట్టి డిస్చార్జ్ చేస్తారనుకున్నామంతా అంతలోనే ఈ ఉపద్రవం . నాకా బ్యాంక్‌కార్డ్ లేదు. లేకపోతే నీ వరకూ రానయ్యా. వాళ్ళ పిల్లలు కూడా నేడో రేపో వచ్చేస్తారు. రాగానే చెప్పి మొదటగా నీ డబ్బు ఇప్పిస్తాను నన్ను నమ్ము" అన్నారు ఆందోళనగా.

"అయ్యో! అలా అంటారేమిటండీ! మనిషికి మనిషి సాయం చేసుకోకపోతే ఎలా? పదండి ఆలస్యం అవుతుంది. అలా వెళుతూ ఏటీఎం లోంచి డబ్బు డ్రా చేసి ఇస్తాను." అని స్కూటర్ మీద ఎక్కించుకుని డబ్బు డ్రా చేసి ఇచ్చి "వాళ్ళింటి దగ్గర నేను దింపుతానంటే" వద్దులేవయ్యా నేను చూసుకుంటాను.. నువ్వు ఆఫీసుకెళ్ళు.. ఇప్పటికే ఆలస్యమైంది" అంటూ గబగబ వెళ్ళిపోయారు.

రాత్రి మా ఇంటికొచ్చి "నా చేతిలో మూడు వేలుంచి.. వాళ్లబ్బాయిలింకా రాలేదు.. అందుకని నా దగ్గరున్నది నీకు ఇస్తున్నాను. వాళ్ళొచ్చాక మిగతాది ఇస్తాను. సమయానికి ఆర్థిక సాయం చేసి ఆదుకున్నావు. నువ్వు నిజంగా దేవుడివయ్యా ఆయనకి ప్రాణం పోశావు. ఆ తల్లి నిన్ను వేనోళ్ల దీవిస్తూంది తనకి పతి భిక్ష పెట్టినందుకు." అన్నారు.

నేను సిగ్గుతో కుంచించుకుపోతూ "అయ్యయ్యో.. వాళ్ళ పిల్లలు వచ్చినప్పుడే తీసుకుని ఇవ్వాల్సింది. అనవసరంగా మీ దగ్గరున్నది ఇస్తున్నారు. డబ్బు అవసరం నాకిప్పుడప్పుడే లేదులెండి." అన్నాను.

"అలాగనకయ్యా.. తీసుకోకపోతే నా మీద ఒట్టే" అని బలవంతంగా నా చేతిలో పెట్టారు.

ఇహ చేసేదేం లేక తీసుకుని "ఒక మనిషిని కోల్పోతే కుటుంబానికి ఎంతలోటో నాకు తెలుసు. పోన్లేండి.. ఆయన కోలుకున్నారన్న మంచివార్త చెప్పారు.. అది చాలు." అన్నాను.

✦✦✦

ఒకరోజు నేను ఆఫీసు నుండి రాగానే మా ఆవిడ నాకు మంచి నీళ్లిస్తూ.. మధ్యాహ్నం నేనూ అత్తయ్యగారూ షాపింగ్‌మాల్‌కి వెళ్లాం. నేను వస్తువులు తీసుకుంటుంటే.. తను కూడా ముచ్చటపడి నాతో పాటూ సరుకులు తీసుకుంది. సరదాగా నాతో రావడం వల్ల ఆవిడ డబ్బు తెచ్చుకోలేదట. మామయ్యగార్ని అడిగి సాయంత్రం ఇస్తానంది. అందుకని క్రెడిట్‌కార్డ్‌తో ఆవిడ డబ్బు అయిదు వేలూ కూడా నేనే పే చేసేశాను" అంది.

"సర్లేవోయ్, వాళ్ళెక్కడికెళతారు? మన తల్లిదండ్రులతో సమానమే!" అన్నాను నవ్వుతూ.

✦✦✦

ఆ రోజు నేను అత్యవసరంగా ఆఫీసు పనిమీద బెంగళూరు వెళ్ళవలసి వచ్చింది.

పెళ్ళయ్యాక మా ఆవిడ్ని వదిలిపెట్టి అదే మొదటిసారి వెళ్ళడం.నాకు చాలా బెంగగా వుంది. తన వాళ్ళు కాని మా వాళ్ళు కాని దగ్గర్లో లేదు. అందుకని గబగబ జగన్నాథం గారింటికెళ్ళి విషయం చెప్పి "సార్ తనని మీరే జాగ్రత్తగా చూసుకోవాలి. ఒక్కత్తి ఉండలేదు. నేను మూడు నాలుగు రోజుల్లో పని పూర్తవగానే వచ్చేస్తాను." అన్నాను.

"అది నువ్వు చెప్పాలటోయ్! ఆమె మా అమ్మాయి. నువ్వు నిశ్చింతగా నీ ఆఫీసు పని చేసుకురా!" అన్నాడు.

✦✦✦

నేను వెళ్ళిన నాలుగు రోజులకి నాకు మా ఆవిడ నుండి ఫోన్ వచ్చింది. 'తను హాస్పిటల్లో వున్నానని. ప్రస్తుతం బాగానే వుందని.' అసలేం జరిగిందని? ఎంత అడిగినా ఫోన్‌లో చెప్పలేదు. 'ఇప్పుడు బాగానే వుంది కాబట్టి ఆందోళన పడకుండా జాగ్రత్తగా ఆఫీసు పని పూర్తి చేసుకుని' రమ్మంది.

నా గుండె జారిపోయింది. అసలు తనకేమయుంటుంది? నేను హుటాహుటిన బయల్దేరి వచ్చేశాను.

మా ఆవిడ ఒక్కతి హాస్పిటల్లో వుంది. నేను అసలేం జరిగిందని అడిగా..

✦✦✦

"మీరెళ్ళాక ఆ దంపతులిద్దరూ మనింట్లోనే మకాం వేశారు. రాత్రి భోజనాలు కూడా చేసి వాళ్ళింటికి వెళ్ళేవారు. ఒకరోజు రాత్రి పది గంటలకి నాకు కడుపులో నొప్పి వచ్చింది. ఎందుకైనా మంచిది మరీ అర్ధరాత్రయితే కష్టం గనక డాక్టరు దగ్గరకెళ్ళి చూపించుకుందామని జగన్నాథం గారింటికి వెళ్ళి తలుపు కొట్టాను. ఆయన తలుపు తీసి విషయం తెలుసుకుని "ముసలివాణ్ణి నేనేం చెయ్యగలనమ్మా? పైగా ఓపిక కూడా లేదు. నువ్వు మరెవరినన్నా సాయమడిగి ఆస్పత్రికెళ్లు.. నేను ఉదయాన్నే వచ్చి చూస్తాను." అన్నారు.

"నాకు భయంగా వుందండి.. పోనీ అత్తయ్యగారినన్నా పంపండి .. ప్లీజ్" అని ప్రాధేయపడ్డాను.

"అది భర్త చాటు భార్య.. దానికేం తెలియదు. నువ్వు త్వరగా ఎవరినన్నా పట్టుకుని ఆస్పత్రికెళ్ళు. రేపు నీకేవన్నా అయితే... మేము మీ ఆయనకి ముఖం చూపించుకోలేము.' అని తలూపేసి పంపించేశారు." చెప్పి బోరుమని ఏడ్చింది.

"ఆ తర్వాత నొప్పి ఎక్కువైంది. నేను ఆటో మాట్లాడుకుని ఒక్కదాన్నీ ఆస్పత్రికెళ్ళాను." వెక్కుతూ బాధతో చెప్పింది.

నాకు విపరీతమైన కోపం వచ్చింది. "ఇలాంటి మనుషులు కూడా వుంటారా? ఎంత బాగా మాట్లాడేవాడు? మనుషుల్లో దేవుడిలా

మసిలేవాడు. అంత దారుణంగా ఎలా ప్రవర్తించాడు?"

మా ఆవిడ్ని మరుసటిరోజు డిశ్చార్జ్ చేశారు. నేను తనని ఇంటిలో దింపి జగన్నాథం గారింటికెళ్లాను ఆయన్ని నిలదీద్దామని.

ఇంటికి తాళం వేసి వుంది.

'ఓహో ముఖం చూపించలేక ఎక్కడికో వెళ్ళారన్నమాట' అనుకుంటూ ఇంటికొచ్చాను.

విషయం తెలిసి నలుగురైదుగురు వీధిలో వాళ్లు పరామర్శించడానికి వచ్చారు.

వాళ్లతో అప్పటి మా ఆవిడ దీనావస్థ చెప్పి.. "ఆ జగన్నాథం గారు ఇలా చేస్తారనుకోలేదు" అన్నాను బాధగా.

" ఆ భార్యాభర్తలిద్దరూ రోగ్స్ అండి. అందుకే మేము మా ఇళ్ళకి రానియ్యము. మీరు కొత్తగా వచ్చారు కాబట్టి వాళ్ళ తియ్యటి మాటలకి లొంగిపోయారు. వాళ్ళ మూలంగా మేము చాలా సమస్యలు ఎదుర్కొన్నాం." అన్నారు.

నాకు వెంట్రుకలు నుంచున్నాయి. వాళ్ళకి అప్పటి దాకా సుమారు డెబ్బైవేలు ఖర్చు పెట్టాము. పక్కవీధిలోనే కాదు ఆ ఏరియాలోనే ఎవరికీ యాక్సిడెంట్ జరగలేదని తెలిసి నివ్వెరపోయాను. నేనిచ్చిన పదివేలలో నాకే మూడు వేలు తిరిగిచ్చి ఎంత బాగా నటించాడు?.. నయవంచకుడు.

తర్వాత వాళ్ళ ఇంటి ఓనరు చెబితే తెలిసింది మా ఆవిడ ఆస్పత్రిలో ఉండగా రాత్రికి రాత్రి సామాను సర్దుకుని ఖాళీ చేసి వెళ్ళిపోయారని. జగన్నాథం లాంటి వాళ్ళు కాగితం పూల వంటి వారు! ఆకర్షణకే తప్ప అవసరానికి పనికి రారు.

అప్పటి నుండి మాకు ఎంతమంచి వారు కనిపించినా 'అది కపటమేమో' అన్న ఫోబియా పట్టుకుంది. తీవ్రవాదుల వల్లే కాదు ఇలాంటి వాళ్ల వల్ల కూడా మనిషిని మనిషి నమ్మలేని పరిస్థితి వస్తోంది. మనిషి సంఘజీవి. తను అందరికీ ఉపయోగపడాలి. తనకి అందరూ సాయపడాలి. కాని ఇలాంటి వాళ్ళ వల్ల ఎవర్నీ మనస్ఫూర్తిగా నమ్మలేకపోతున్నాం. ప్రశాంతంగా మనుగడ సాధించలేకపోతున్నాం.

## కొండపూలు

కొండరాళ్ల, బండరాళ్ళ ఒరిపిడిని
ఎండావానల తడుపులను
చలికాలపు బలవంతపు కౌగిళ్ళను
తట్టుకొని నిలబడే
సుగంధం అంటని
సువాసనలు వెదజల్లని
రంగురంగుల అమాయకపు
అడివిపూలు
నల్లని, తెల్లని దేహాలపై
కారుతున్న చెమట ధారల్లో
పేరుకొని ఉన్న మట్టి-చారలతో
పరమ పవిత్ర భావనను
వ్యక్తీకరించే ఆధునిక కాలపు
మట్టిపూలు
అమావాస్యల, వెన్నెలల
ఆలోచనా తడుపులతో
రేపటి నైరాశ్యాన్ని
ఈ రోజు దరి చేరనివ్వని
నిరంతర వికసిత పూలు
ఎండుకట్టెల మోతలతో
వెన్నుకంటుకొని ఉన్న పొట్టను
నవీన నాగరికతా చిహ్నంగా చూపిస్తూ
ఊహాలోకపు వీధులనుండి
వాస్తవికత వైపుకు తీసుకెళ్ళే
కవితా పుష్పాలు
ఆధిపత్యపు అజమాయిషీలో
పసుపువర్ణాన్ని సంతరించుకొని
నేలతల్లిని కౌగిలించుకోవడానికి
వెనుకడుగెయ్యని
పోరాటపుష్పాలు
అమాయకత్వం నిండిన
చిరునవ్వులతో
నేలకు అంటుకొని ఉన్న నివాసాలలో
నిరంతరం నిలబడలేక తడబడుతూ
చెట్లు మొదళ్లలో, గుబురు పొదరిళ్లలో
తమ నివాసాలను వెతుక్కొనే
విధివంచిత పూలు
స్వేచ్ఛా వాసనల కోసం
నిరంతరం తమలోతాము
ఘర్షించుకొంటూ
నాగరికులమనే దుండగుల
దోపిడీకి గురౌతూ ఉన్నా
నిత్యాహ్లాద వికసిత వదనాలతో
రగులుతున్న మంటలను
పైకి వ్యక్తం చేయని
అగ్నిపూలు
ఆడంబరాలను, అలంకారాలను
వెతుక్కొంటూ
ఆదిమానవ ప్రతిరూపాలై
అవిటి అడవి సామ్రాజ్యంలో
నిర్విరామంగా సంచరిస్తుంటే
సంచారపూలు
కొండలు, గుట్టలు, ముళ్ళపొదల్లలో
ఆహారాన్వేషణ చేస్తూ
తుమ్మెదల ఝుంకారాలతో తడబడిపోతూ
ఆకలిని ఆవిరి చేసుకొనే
ఆకలిపూలు
కార్చిచ్చుకు ఎదురొడ్డి నిలబడినా
మోసం కుట్రల దగాలతో
తలక్రిందులైపోతూ
నిజాయితీని, నమ్మకాన్ని
నరనరాన నింపుకొన్న
నిజాయితీ పూలు
తుపాకీగుండుకు గుండెను ఎదురొడ్డి
జీవితాన్ని నలిపివేసినా,
జీవాన్ని తొక్కివేసినా
కలత చెందక
నిర్మగ్న సుందర పుష్పాలుగా
మగ్న దేహాలతో మెరిసిపోతూ
వాడుతనాన్ని దరిచేరనివ్వని
మెరుపులోకాన్ని వదలని
సజీవ దృశ్య సాక్ష్యాలు
కొండపూలు.

– తన్నీరు నాయబ్ రసూల్
పాడేరు, 94901 70661